
మడనూరు రథోత్సవంలో పాల్గొన్న భక్తులు


మడనూరు రామలింగేశ్వరస్వామివారికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

# శంకరా...హరహరా

- కన్నుల పండువగా రామలింగేశ్వరుని రథోత్సవం
- భక్తులతో కిక్కిరిసిన మడనూరు, ఈతముక్కల
- జిల్లా నలుమూలల నుంచి తరలి వచ్చిన భక్తులు

**మడనూరు (కొత్తపట్నం):** హరహర మహాదేవ.. శంభో శంకర అంటూ వేలాది మంది భక్తులతో మడనూరు రామలింగేశ్వరుని రథోత్సవం కనుల పండుగగా సాగింది. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాల్గొవ రోజు శుక్రవారం భక్తిశ్రద్ధలతో, మహా వైభవంగా రథోత్సవం నిర్వహించారు. మడనూరులో నిర్వహించిన రథోత్సవంలో భక్తులు పోటెత్తారు. ఒంగోలు నగరం, కొత్తపట్నం మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో జనసంద్రంగా మారింది. పురోహితులు రథాన్ని ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణం శివనామ స్మరణతో మార్మోగింది. రథోత్సవాన్ని కార్యనిర్వహణాధికారి సుబ్రహ్మణ్యం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా రథం వద్ద వంశపారంపర్య ఆగమకర్త కొంపల్లి వీరభద్రరావు, వారి కుటుంబీకులు బుచ్చేశ్వరరావు, సతీమణి నాగలక్ష్మి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ప్రత్యేక అలంకరణతో ముస్తాబు చేసిన గంగా పర్వతి వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి, కన్నేశ్వరస్వామి, జ్వాలాముఖి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేసి మేళతాళాలతో రథంపై చేర్చారు. ముఖ్య అతిథిగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ఆలయంలో పూజలు చేసుకుని రథం ప్రాంగణానికి చేరుకున్నారు. ఈవో సుబ్రహ్మణ్యం కాపులు, గ్రామ పెద్దలు రథం ముందు టెంకాయలు కొట్టి పూజలు చేశారు. అప్పటికే సిద్ధం చేసిన రథానికి కట్టిన తాడును పట్టుకుని హరోం హరహర మహాదేవ శంభోశంకర అంటూ రథాన్ని ముందుకు లాగి ప్రారంభించారు. రథం లాగడానికి యువకులు, మహిళలు, భక్తులు పోటీ పడ్డారు. పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో ఈతముక్కల నుంచి మడనూరు రామలింగేశ్వర స్వామి ఆలయం వరకు రోడ్డంతా జనంతో నిండింది. రథం వెళుతున్న సమయంలో ఇంటిలో నుంచి బయటకు వచ్చి రథం చక్రాల కింద గుమ్మడి కాయలు, పళ్లు పెట్టి స్వామివారిని దర్శించుకుని కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. రథం మడనూరు రామలింగేశ్వరస్వామి ఆలయం నుంచి బయలుదేరి ఈతముక్కల గ్రామానికి చేరుకుంది. శనివారం మళ్లీ మడనూరు గ్రామానికి చేరుతుంది.

**భారీగా పోలీసు బందోబస్తు:**

రథోత్సవం సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ మేడా శ్రీనివాసరావు, ఎస్సై సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం నుంచే రోడ్డు ఇరువైపులా బల్లలు, షాపులను పక్కకు పెట్టించారు. మడనూరు గ్రామం నుంచి ఈతముక్కల గ్రామం వరకు అడ్డంగా ఉన్న వాటిని తొలగించారు. వారం రోజుల ముందు సీఐ, ఎస్సై రూట్ మ్యాప్‌ను పరిశీలించి మలుపుల దగ్గర జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి సూచనలు ఇచ్చారు.


అలంకరణలో మడనూరు రామలింగేశ్వరస్వామివారు

పుర వీధుల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. వాహనాలు రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూశారు. రథం తిరిగే ప్రాంతంలో కాకుండా ఆలయం ప్రాంగణంలో ద్విచక్ర వాహనాలు, కార్లు అన్నీ పెట్టుకోవడానికి పార్కింగ్ ఏర్పాటు చేశారు. రథం తిరిగే రోడ్డుకు రాకుండా వేరే మార్గంలో వాహనాలను మళ్లించారు. సీఐలు 2, ఎస్సైలు 4, హెచ్‌సీలు 3, స్పెషల్ పార్టీవారు 20, కానిస్టేబుల్ 28, హోంగార్డులు 10 మందితో శాంతిభద్రతలు పర్యవేక్షించారు.

**ఎమ్మెల్యే దామచర్ల ఆలస్యంతో భక్తులకు అసౌకర్యం...**

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆలస్యంగా రావడంతో చీకటి పడిన తర్వాత రథోత్సవాన్ని ప్రారంభించారు. దానికితోడు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో రథోత్సవం చీకట్లో జరిగి భక్తులకు సరిగ్గా కనిపించక అసౌకర్యానికి గురయ్యారు. రథం లాగే భక్తులు కూడా చీకట్లో అతికష్టంమీద లాగి ఈతముక్కల గ్రామానికి చేర్చారు. గతంలో ఎప్పుడూ ఈ విధంగా చీకట్లో రథోత్సవం జరగలేదని, ఎమ్మెల్యే ఆలస్యంగా రావడం వలనే ఇలా జరిగిందంటూ పలువురు భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

## భక్తిశ్రద్ధలతో నాలుగు దేవుళ్ల గ్రామోత్సవం


రావణబ్రహ్మ వాహనంపై కన్నేశ్వరస్వామి


ఐరావత వాహనంపై జ్వాలాముఖి అమ్మవారు


గరుడ వాహనంపై కోదండరామస్వామి

**మడనూరు (కొత్తపట్నం):** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గంగాపర్వతవర్ధని సమేత రామలింగేశ్వరస్వామి, కన్నేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత శుక్రవారం పగలంతా నాలుగుదేవుళ్ల గ్రామోత్సవాన్ని కన్నుల పండువలా నిర్వహించారు. మూడోరోజు సాయంత్రం రామలింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఒంగోలు నగరం, చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిక్కిరిసింది. గ్రామోత్సవం సందర్భంగా రామలింగేశ్వరస్వామి, కన్నేశ్వరస్వామి, జ్వాలాముఖి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయం చుట్టూ మేళతాళాలతో స్వామివారిని తిప్పుకుంటూ వాహనాలపై చేర్చి అలంకరించారు. నరనంది వాహనంపై రామలింగేశ్వరస్వామి వారిని, రావణబ్రహ్మ వాహనంపై కన్నేశ్వరస్వామి వారిని, ఏనుగు వాహనంపై జ్వాలాముఖి అమ్మవారిని అలంకరించారు. రామలింగేశ్వరస్వామి ఆలయం ముందు కోనేరు పక్కన ఉంచారు. ఈతముక్కల గ్రామంలో ముస్తాబు చేసిన గరుడ వాహనంపై అలంకరించిన అనంత కోదండరామ స్వామిని మేళతాళాలతో ఊరేగించుకుంటూ భారీగా బాణసంచా పేల్చుకుంటూ రామలింగేశ్వర స్వామి ఆలయానికి తీసుకొచ్చారు. రామలింగేశ్వర స్వామి ఆలయంలో నాలుగు దేవుళ్లకు పూజలు చేశారు. అలంకరించిన నాలుగు దేవుళ్ల ముందు టెంకాయలు కొట్టి ఆలయం దగ్గర్లో ఉన్న రథం ఆవరణలో నాలుగు దేవుళ్లను వరుస క్రమంలో ఉంచారు. నాలుగు దేవుళ్లకు ప్రత్యేక పూజలు చేసి భారీగా మందు చెట్లు పేల్చారు. భక్తులు భారీగా పాల్గొని తిలకించారు. వరుస క్రమంలో ముందుగా రామలింగేశ్వరస్వామి, పక్కన శ్రీకోదండరామ స్వామి, కన్నేశ్వరస్వామి, చివరిగా జ్వాలాముఖి అమ్మవార్లను ఒకరి వెంట మరొకరిని ఉంచి గ్రామోత్సవరం నిర్వహించారు. నాలుగు దేవుళ్లను చూడటానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. మేళతాళాలతో ఊరేగింపుగా రామలింగేశ్వరస్వామి ఆలయం నుంచి మడనూరు బస్టాండ్ సెంటర్ మీదుగా ఈతముక్కల బస్టాండ్ సెంటర్, ఈతముక్కల వీధుల్లో ఊరేగించి సాయంత్రానికి రామలింగేశ్వర ఆలయానికి చేరుకున్నారు. ప్రతి ఇంటి ముందు భక్తులు టెంకాయలు కొట్టి హారతులిచ్చారు. గ్రామోత్సవం అనంతరం సాయంత్రానికి ఈతముక్కల రామలింగేశ్వరస్వామి ఆలయానికి నాలుగు దేవుళ్లు చేరుకున్నారు. ఆలయ ఆధ్వర్యంలో పాటకచేరి, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎండోమెంట్ ఈవో సుబ్రహ్మణ్యం పర్యవేక్షించగా, ఎస్సై సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.


నరనంది వాహనంపై రామలింగేశ్వరస్వామి

## ఘనంగా తవనం చెంచయ్య వర్ధంతి

**సంతనూతలపాడు:** మాజీ ఎమ్మెల్యే తవనం చెంచయ్య వర్ధంతిని స్థానిక పీర్ల మాన్యంలో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మాబు, నాయకుడు షేక్ కాలేషా, జిల్లా కమిటీ సభ్యుడు బంకా సుబ్బారావు, మండల కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి, శాఖ కార్యదర్శి కోడూరి రామకృష్ణారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హెచ్‌ఎం ఉద్యోగ విరమణ సందర్భంగా సత్కారం

**సంతనూతలపాడు:** స్థానిక అంబేడ్కర్‌నగర్లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం చుంచు రామాంజనేయులు ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం ఘనంగా సన్మానించారు. సంతనూతలపాడు సర్పంచ్ దర్శి నాగమణి, మండవ మురళీకృష్ణ, మాజీ సర్పంచ్ రంపతోటి అంకారావు, ఉపాధ్యాయురాలు టి.విద్యాశ్రీ, ఒంగోలు డిప్యూటీ డీఈవో ఏ చంద్రమౌళేశ్వర్, ఎంఈఓ డి.వెంకారెడ్డి, సంతనూతలపాడు హైస్కూల్ హెచ్‌ఎం ఎం.ప్రమోద, ట్రస్ట్ అడ్వైజర్ మండవ సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

**మద్దిపాడు:** మండల పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మద్దిపాడు పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. మండల పరిధిలోని గుండ్లాపల్లి పారిశ్రామికవాడ సమీపంలో ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్సై శివరామయ్య అదుపులోకి తీసుకుని సీజ్ చేశారు. అనంతరం ట్రాక్టర్లను మద్దిపాడు స్టేషన్‌కు తరలించారు. తదుపరి చర్యల నిమిత్తం ట్రాక్టర్ల డ్రైవర్లను తహసీల్దార్ సుజన్‌కుమార్ ముందు హాజరుపరిచారు.

## మోసపూరిత బడ్జెట్

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి

**ఒంగోలు సిటీ:** ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ అంటూ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. ప్రజలను నిట్టనిలువునా మోసం చేశారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి విమర్శించారు. శుక్రవారం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌పై ఆయన మాట్లాడుతూ బాబు వంచన, మోసం గ్యారంటీ అనే రీతిలో బడ్జెట్ ఉందన్నారు. కేవలం అంకెల గారడీ, గ్రాఫిక్స్‌తో కూడుకున్నదే తప్ప ప్రజల అభివృద్ధి, సంక్షేమం గురించి, ఎన్నికల హామీల గురించి ప్రస్తావించకపోవడంతో చంద్రబాబు మోసం మరోసారి బట్టబయలైందన్నారు.

**మహిళలని మోసం చేశారు : వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ**

**సంతనూతలపాడు:** మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమని కూటమి నేతలు ఇచ్చిన హామీ ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదని, ఇక దాల్చబోదని ఈ బడ్జెట్ ద్వారా స్పష్టంగా తెలిసిపోతోందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ విమర్శించారు. పక్క రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత బస్సు హామీని అమలు చేశాయని, మన రాష్ట్రంలో ఈ బడ్జెట్లో అయినా ప్రవేశపెడతారేమో అని ఎదురుచూసిన మహిళలకు ఆశాభంగం తప్పలేదని అన్నారు. చంద్రబాబు మహిళలను నిలువునా మోసం చేశారని విమర్శించారు.

**ఇది రైతు వ్యతిరేక బడ్జెట్: చుండూరి రంగారావు, సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్**

ఇది ముమ్మాటికీ రైతు వ్యతిరేక బడ్జెట్. 4.5 లక్షల ఎకరాలకు సాగునీరందించే వెలుగొండ ప్రాజెక్టుకు నామమాత్రంగా నిధులను కేటాయించడం, మిర్చి క్వింటాలు ధర గుంటూరు మిర్చి యార్డులో రూ.13 నుంచి రూ.14 వేలు ఉండగా ప్రభుత్వం మద్దతు ధర కేవలం రూ.11,781 ప్రకటించడం, ధరల స్థిరీకరణకు కేవలం రూ.300 కోట్లు కేటాయించడం దీనికి నిదర్శనం. ప్రజలకు మేలు చేయడం చేతకాక మీడియా ముందు ఏడవడం సిగ్గుచేటు.

**ఆర్‌ఆర్ ప్యాకేజీకి రూ.116 కోట్లేనా: చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసి రాష్ట్ర అధికార ప్రతినిధి**

వెలుగొండ ప్రాజెక్టుకు సంబంధించి ఆర్ ఆర్ ప్యాకేజికి రూ.1000 కోట్లు కేటాయించాల్సి ఉండగా రూ.116 కోట్ల మాత్రమే విదిల్చడం దారుణం. దీంతో నిర్వాసితులకు ఎలాంటి న్యాయం చేయాలనుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చు. నిర్వాసితుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం ఎంత మాత్రం మంచిదికాదు. అలాగే సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చారు. ఇప్పుడు దాన్ని పక్కప పెట్టేసి ప్రజా సంక్షేమాన్ని దెబ్బతీశారు. నిరుపేదలను దగా చేశారు.

## 5, 6 తేదీల్లో జాబ్‌మేళా

**ఒంగోలు వన్‌టౌన్:** ఈనెల 5, 6వ తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, నాస్కామ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రైమ్ కెరీర్ ఫెయిర్ జాబ్ మేళాను గీతం యూనివర్సిటీ, విశాఖపట్నంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జే రవితేజ యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, డిప్లమో, బీటెక్ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ, యువకులను ఉద్యోగాలకు ఎంపిక చేయడానికి 40కి పైగా బహుళ జాతీయ ఐటీ, నాన్ ఐటీ కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటాయని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు మార్చి 3వ తేదీ లోపు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఇతర పూర్తి వివరాలకు ప్లేస్‌మెంట్ అధికారి ఎస్‌కె బాషాను 8125215216 అనే నంబరుపై సంప్రదించాలని కోరారు.



## సంక్షిప్తంగా

### హలో మాల.. ఛలో ఒంగోలును జయప్రదం చేయండి

**చీమకుర్తి:** మాలమహాసభ ఆధ్వర్యంలో ఒంగోలులోని బండారు రామారావు, చీమకుర్తి నాగేశ్వరరావు కళాప్రాంగణంలో మార్చి 16వ తేదీ నిర్వహించనున్న హలో మాల.. ఛలో ఒంగోలు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం చీమకుర్తి అంబేడ్కర్‌నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు, మాలమహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండేల కృష్ణ, మాల మహాసభ నాయకులు చావాబత్తిన బ్రహ్మయ్య, వేమా బాలకోటి, మట్టిగుంట రామాంజనేయులు, స్థానికులు పాల్గొన్నారు.

### ఘనంగా టైలర్స్ డే

**నాగులుప్పలపాడు:** టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో శుక్రవారం టైలర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కుట్టుమిషన్ సృష్టికర్త విలియమ్స్ హోవే, టైలర్స్ డే సృష్టికర్త కేఎం స్వామి చిత్రపటాలకు నివాళులర్పించారు. టైలర్స్ డే జెండా ఆవిష్కరించారు. అసోసియేషన్ నాయకులు అమరా నాగేశ్వరరావు, వల్లూరి వెంకట్రావు, రాచపూడి నరసింహరావు, శాలివాహన సంఘ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పేరాల చెన్నకేశవులు, టైలర్లు పాల్గొన్నారు.

**చీమకుర్తిలో...**

**చీమకుర్తి:** చీమకుర్తిలో శుక్రవారం టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ టైలర్స్ డేని ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి బస్టాండ్ వద్ద జెండా ఆవిష్కరించారు. కుట్టుమిషన్ సృష్టికర్త హోవే చిత్రపటానికి నివాళులర్పించారు.

### పీడిత కులాలకు అండగా వెంకట సుబ్బయ్య

**ఒంగోలు టౌన్:** విప్లవ కమ్యూనిస్టుగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ప్రముఖ న్యాయవాది మెట్ల వెంకట సుబ్బయ్య దళిత పీడిత కులాలు చేపట్టిన ప్రజా ఉద్యమాలకు అండగా నిలబడి ఆదర్శవంత జీవితం గడిపారని ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక దేవుడు చెరువు సమీపంలోని ఆదర్శ న్యాయ సహాయ కేంద్రంలో మెట్ల వెంకట సుబ్బయ్య 17వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వెంకట సుబ్బయ్య కుమారుడు, న్యాయమూర్తి మెట్ల కృష్ణమోహన్, ప్రజా సంఘాల నాయకులు, దళిత హక్కుల సంఘాల నాయకులు, మాజీ జెడ్పీ చైర్మన్ కాటం అరుణమ్మ, చైల్డ్ వెల్ఫేర్ మెంబర్ పద్మావతి, సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి కె.అరుణ, చావలి చైతన్య, సూర్యకుమారి, బీసీ సంఘాల సమన్వయ సమితి జిల్లా కార్యదర్శి బొట్ల సుబ్బారావు, గాండ్ల హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. తొలుత వెంకట సుబ్బయ్య చిత్రపటానికి నివాళులర్పించారు.

### ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం


వ్యాధిగ్రస్తులకు వైద్యసేవలు అందిస్తున్న వైద్యాధికారి అఫ్సర్

**చీమకుర్తి రూరల్:** పెద్దలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండలంలోని బండ్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అఫ్సర్ సూచించారు. శుక్రవారం మండలంలోని గాడిపర్తివారిపాలెం సచివాలయం పరిధిలో గల రంగసాయిపురం విలేజ్ హెల్త్ క్లినిక్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 40 సంవత్సరాల తర్వాత ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతాయని, ప్రతిఒక్కరూ జాగ్రత్త వహించి విలేజ్ హెల్త్ క్లినిక్లో చూపించుకోవాలని సూచించారు. అనంతరం విలేజ్ హెల్త్ క్లినిక్లో 59 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు బీపీ, షుగర్, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని ఉచితంగా మందులు అందజేసి సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక ఆశా వర్కర్లు, హెల్త్ క్లినిక్ సిబ్బంది పాల్గొన్నారు.

### పంచాయతీ కార్యదర్శికి సన్మానం


శ్రీనివాసరెడ్డి, అనురాధ దంపతులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

**సంతనూతలపాడు:** మండలంలోని గురువారెడ్డిపాలెం పంచాయతీ కార్యదర్శి జెట్టి శ్రీనివాసరెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా వారి దంపతులను ఎంపీడీవో డి.సురేష్‌బాబు, ఎంపీపీ బుడంగుంట విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, పంచాయతీ కార్యదర్శుల సంఘ మండల అధ్యక్షుడు ఎస్.ప్రతాప్ కుమార్ తదితరులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి సేవలను కొనియాడారు.

### సబ్సిడీపై చాప్‌కట్టర్ అందించిన జేడీ

**మద్దిపాడు:** పశువుల మేత కత్తిరించే చాప్ కట్టర్‌ను జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ బేబీరాణి మద్దిపాడులో శుక్రవారం ఉదయం పశుపోషకురాలికి సబ్సిడీపై అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేత కోసే యంత్రాన్ని 40 శాతం సబ్సిడీతో ఇస్తున్నామని తెలిపారు. 33 వేల రూపాయల విలువైన ఈ యంత్రాన్ని 40 శాతం సబ్సిడీపై లబ్ధిదారులకు రూ.20 వేలకే అందించినట్లు చెప్పారు. పశుపోషకులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. శనివారం నుంచి మార్చి నెలాఖరు వరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు, నాలుగు నుంచి ఎనిమిది నెలల వయసు గల ఆడ దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. పశుపోషకులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకుని పశువులు వ్యాధిబారిన పడకుండా కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏడీ సుగణ్యారావు, పశు వైద్యుడు అనిల్, పశుసంవర్థకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### పీజీ కోర్సులపై విద్యార్థులకు అవగాహన సదస్సు

**ఒంగోలు సిటీ:** డిగ్రీ పూర్తి చేసుకున్న తర్వాత పీజీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఎలా చేసుకోవాలనే అంశంపై విద్యార్థులకు స్థానిక ఆంధ్రకేసరి యూనివర్సిటీ డీఓఏ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులోని శ్రీహర్షిణి డిగ్రీ కళాశాలలో ‘స్టూడెంట్ కెరీర్ గైడెన్స్ ఆన్ పీజీ కోర్సెస్ ఏకేయూ’ అనే కార్యక్రమం నిర్వహించారు. ఏకేయూ డీఓఏ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ జి.సోమశేఖర, ఏకేయూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజమోహన్‌రావు, రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ విభాగం డైరెక్టర్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.నిర్మలామణి, కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి డాక్టర్ బి.పద్మజ, ఆక్వాకల్చర్ విభాగం సహాయ ఆచార్యుడు డాక్టర్ బి.సురేష్, తదితరులు పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు.

### రౌడీషీటర్లు బైండోవర్

**చీమకుర్తి:** మండలంలోని రౌడీషీటర్లను తహసీల్దార్ వద్ద శుక్రవారం బైండోవర్ చేయించినట్లు సీఐ ఎం.సుబ్బారావు తెలిపారు. మండలంలో మొత్తం 25 మంది రౌడీషీటర్లు ఉండగా, వారిలో ప్రస్తుతం 15 మందిని తహసీల్దార్ వద్ద రూ.2 లక్షల పూచికత్తుతో హాజరుపరిచి బైండోవర్ చేయించినట్లు తెలిపారు. మిగిలిన వారిని రానున్న రెండు రోజుల్లో బైండోవర్ చేయిస్తామన్నారు. ప్రతి ఆరునెలలకు ఒకసారి బైండోవర్ చేసే కార్యక్రమంలో భాగంగానే వారిని హాజరుపరిచామన్నారు. సత్ప్రవర్తన కలిగి ఉండాలని, గ్రామాల్లో ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా ఉండాలని సూచించారు.

## వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జిని పరామర్శించిన చుండూరి


కార్యక్రమంలో పాల్గొన్న చుండూరి రవిబాబు, నాయకులు

**ఒంగోలు వన్‌టౌన్:** వైఎస్సార్ సీపీ ఒంగోలు 13వ డివిజన్ ఇన్‌చార్జి ఎం.సూర్యరాజేష్‌ను ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు శుక్రవారం పరామర్శించారు. రాజేష్ తల్లి ప్రమీల అనారోగ్యంతో ఫిబ్రవరి 18వ తేదీ మరణించారు. శుక్రవారం కబాడిపాలెంలోని సీతా సొసైటీ కమ్యూనిటీ హాలులో ఆదరణ స్తుతి కూడిక నిర్వహించగా, చుండూరితో పాటు పార్టీ నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, కార్పొరేటర్లు గంగవరపు ప్రవీణ్, మహ్మద్ ఇమ్రాన్‌ఖాన్, కోఆప్షన్ సభ్యులు శ్యామ్‌సాగర్, 9వ డివిజన్ ఇన్‌చార్జి పూర్ణచంద్రరెడ్డి, 10వ డివిజన్ ఇన్‌చార్జి శ్రీనివాసరావు, 16వ డివిజన్ ఇన్‌చార్జి భాస్కర్, 33వ డివిజన్ ఇన్‌చార్జి జేమ్స్, 36వ డివిజన్ ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి, 47వ డివిజన్ ఇన్‌చార్జి చావలి శ్రీను, 49వ డివిజన్ ఇన్‌చార్జి సుబ్బారావు, దళిత సంఘాల నాయకుడు చప్పిడి వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

### బాణసంచా తయారీ కేంద్రం తనిఖీ


పరిశీలిస్తున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ సుజన్‌కుమార్

**మద్దిపాడు:** మద్దిపాడులోని బాణసంచా తయారీ కేంద్రాన్ని శుక్రవారం ఉదయం ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న పరిశీలించారు. మందుగుండు సామగ్రి తయారు చేయడానికి ఉపయోగించే ముడిసరుకు గురించి, ఆ ముడిసరుకు కలిపే సమయంలో పేలుడు సంభవించకుండా తీసుకుంటున్న జాగ్రత్తల గురించి తయారీదారులను ఆరా తీశారు. తయారైన బాణసంచా నిల్వ చేయడానికి ఏర్పాటు చేసిన గోడౌన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాణసంచా తయారీదారులు లైసెన్స్ రెన్యువల్ చేయించేందుకు అర్జీ ఇచ్చిన నేపథ్యంలో తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న ఆర్డీవో.. రీ సర్వే జరుగుతున్న విధానంపై చర్చించారు. రైతుల సమక్షంలోనే రీ సర్వే నిర్వహించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ రైతు లేకుండా సర్వే నిర్వహించరాదని సూచించారు. ప్రతిఒక్కరికీ విడివిడిగా ఎల్పీఎం నంబర్లు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుజన్‌కుమార్, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది, ఆర్ఐ రమణయ్య, వీఆర్వో సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

### విశ్రాంత జీవితం ప్రశాంతంగా గడపాలి

- ఎస్పీ ఏఆర్ దామోదర్


ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ దేవిడ్‌రాజును సన్మానిస్తున్న ఎస్పీ దామోదర్

**ఒంగోలు టౌన్:** సుదీర్ఘ కాలం పోలీసు శాఖలో సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజును ఎస్పీ ఏఆర్ దామోదర్ శుక్రవారం తన చాంబర్లో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రిటైర్‌మెంట్ అనేది కేవలం ఉద్యోగానికే అని, జీవితానికి కాదని అన్నారు. విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులు అనుభవించి విజయవంతంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడం గొప్ప విషయమన్నారు. కుటుంబ సభ్యులతో శేష జీవితాన్ని సంతోషంగా గడపాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఆర్ఐలు సీతారామిరెడ్డి, రమణారెడ్డి, ఏఆర్ ఎస్ఐ తిరుపతిస్వామి తదితరులు పాల్గొన్నారు.